తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | మంగళవారం-28- అక్టోబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 149 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# దందాల జోలికి వస్తే ఊరుకోం

- హైడ్రా ప్రజావాణికి 52 ఫిర్యాదులు..
- కబ్జాదారులపై కమిషనర్ దృష్టి




హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలు, రోడ్ల కబ్జాలపై హైదరాబాద్ అభివృద్ధి సంస్థ (హైడ్రా) ప్రజావాణి వేదికగా పౌరులు తమ గళం వినిపిస్తున్నారు. ఎక్కడ అక్రమం జరిగినా చూస్తూ ఊరుకోకుండా, ఫొటోలు, వీడియోలతో సహా సాక్ష్యాలను చూపిస్తూ నేరుగా హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ప్రజావాణి ద్వారా తమ దశాబ్దాల సమస్యలకు సైతం త్వరగా పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతో సోమవారం ఒక్కరోజే 52 ఫిర్యాదులు అందాయి. కొందరు బాహాటంగా ఫిర్యాదులు చేస్తుండగా, మరికొందరు తమ వివరాలు బయటపెట్టవద్దని అధికారులను కోరారు. అందిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేకంగా పరిశీలించారు. అత్యధికంగా ఫిర్యాదులు కబ్జాల మీదనే ఉండటం గమనార్హం. బాలానగర్ మండలం, కూకట్‌పల్లిలోని హస్మత్‌పేటలో ప్రభుత్వానికి చెందిన 10 ఎకరాల భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు వచ్చింది. అదే ప్రాంతంలో, నిజాం కాలం నాటి చారిత్రక విలువ కలిగిన 28.28 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక రాజకీయ నాయకులు రియల్ ఎస్టేట్ వెంచర్‌గా మార్చి విక్రయిస్తున్నారని ఓల్డ్ బోయిన్‌పల్లి నివాసులు సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేశారు. మరో ప్రధాన సమస్య చెరువుల అన్యాక్రాంతం. కూకట్‌పల్లి ప్రాంతంలోని పరికి చెరువులో సుమారు 12 ఎకరాల మేర రాత్రికి రాత్రే మట్టిపోసి ఆక్రమించారని, అక్కడ 18 అంతస్తుల అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే ప్లాట్లు కొన్నవారు నష్టపోతారని హెచ్చరించారు. శంషాబాద్ మండలం, పెద్దగోల్కొండలో సరసింహకుంట తూములు మూసివేయడం, అలుగు ఎత్తు పెంచడంతో పంట పొలాలు మునిగి, ఆ నీరు ఔటర్ రింగు రోడ్డుపైనా చేరుతోందని గ్రామ ప్రజలు మొరపెట్టుకున్నారు.

మిగతా 2లో



# వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

- రూ.8,110 మద్దతు ధరకు విక్రయించాలని మంత్రి కొండా సురేఖ సూచన

వరంగల్, (తెలంగాణ ముచ్చట్లు)

దళారుల మోసాలకు గురికాకుండా ఉండేందుకు, కాంగ్రెస్ ప్రభుత్వం పత్తిని మద్దతు ధరకు నేరుగా కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు.

మిగతా 2లో



# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- రైతు కష్టం వృథా కాదు
- ధాన్యం, పత్తి కొనుగోళ్లపై భువనగిరిలో మంత్రి కోమటిరెడ్డి విస్తృత సమీక్ష
- పత్తి కొనుగోలు, తక్షణ సహాయంపై ప్రాధాన్యత

భువనగిరి, (తెలంగాణ ముచ్చట్లు):

యాదాద్రి భువనగిరి జిల్లా రైతుల సంక్షేమంపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం ప్రత్యేక దృష్టి సారించారు. భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఆయన జిల్లాలోని ఉన్నతాధికారులతో వరిధాన్యం సేకరణ, పత్తి కొనుగోలు మరియు ఇతర రైతుల సమస్యల పరిష్కారంపై విస్తృత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి జిల్లా వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లైస్, సహకార, రెవెన్యూ శాఖల అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో

# ‘డిజిటల్ అరెస్ట్’ మోసాలపై సుప్రీం సీరియస్

- దర్యాప్తు సీబీఐకి బదిలీ అయ్యే అవకాశం
- సుమోటో విచారణ: రాష్ట్రాలకు నోటీసులు
- ఎఫ్ఐఆర్‌ల సమర్పణకు ఆదేశం
- సీబీఐ దర్యాప్తుకు సుప్రీం మొగ్గు

న్యూఢిల్లీ: , (తెలంగాణ ముచ్చట్లు)

దేశవ్యాప్తంగా అమాయక పౌరులను టార్గెట్ చేస్తూ పెరిగిపోతున్న ‘డిజిటల్ అరెస్ట్’ మోసాలపై భారత సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. పోలీసులు లేదా న్యాయాధికారులమని చెప్పుకుంటూ నకిలీ కోర్టు పత్రాలతో ప్రజలను బెదిరించి, డబ్బులు వసూలు చేస్తున్న ఈ కుంభకోణాల కేసును అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా విచారణకు స్వీకరించింది. సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ సూర్యకాంత్ మరియు జస్టిస్ జాయ్ మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది.

మిగతా 2లో





# కట్టింగ్ మాస్టర్‌గా మారిన సీఎం రేవంత్ రెడ్డి”

- దక్కన్ వ్యవహారంపై సీబీఐ విచారణకు సిద్ధమా?
- హరీశ్ రావు సవాల్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్యాబినెట్ ‘దండుపాళ్యం ముఠా’ లాంటిదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాను ఒక్కసారి కాదు, పదిసార్లు ఇదే మాట అంటానని ఆయన స్పష్టం చేశారు. ఉన్న విషయం మాట్లాడితే కొందరు మంత్రులకు ఉలుకు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ముధోల్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత సిందే

మిగతా 2లో

# మోదీ కోసం పనిచేస్తున్న రేవంత్

- మోదీ చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే..
- రేవంత్ త్వరగా అమలు చేస్తడు - కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



తెలంగాణలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కాంగ్రెస్‌బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్రంలోని మోదీ సర్కారు తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి త్వరగా అమలు చేస్తారని ఆయన విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.

కేటీఆర్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ‘బడే భాయ్’ (మోదీ) కోసం పనిచేస్తున్నారని, అందుకే ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్‌బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలే కాకుండా వంద గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, తులం బంగారం ఇస్తాం, యువతులకు రూ.2500 ఇస్తాం, వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని అరచేతిలో స్వర్గం చూపించారని ఎద్దేవా చేశారు. ‘‘అదేదో సినిమాలో కోడిని వేలాడదీసి దాన్నే చికెన్ అనుకోమన్నట్లు.. ఇక్కడ కూడా అన్నీ చెప్పి, ఒక్కటి కూడా అమలు చేయట్లేరు’’ అని కేటీఆర్ విమర్శించారు. మైనార్టీ విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని, కేసీఆర్ హయాంలో ఇచ్చిన పథకాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు.

**మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వట్లేదు**

2018లో ఎన్నికలు గెలిచిన తర్వాత కేసీఆర్ మహమూద్ అలీని డిప్యూటీ సీఎంని చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని ఆయన నిలదీశారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్ నాయకత్వానికి కనిపించట్లేదా అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.

# ప్రయాణికుల సేఫ్టీకి తెలంగాణ ఆర్టీసీ పెద్దపీట..

## అధికారులకు ఎండీ నాగిరెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 27:

కర్నూలు సమీపంలో ఇటీవల ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురై 20 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ప్రయాణికులకు సురక్షిత రవాణా సేవలు అందించేందుకు సంస్థ వైస్ చైర్మన్ (వీసీ) మరియు మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) నాగిరెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి మియాపూర్ 1 డిపోను తనిఖీ చేశారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# దందాల జోలికి వస్తే ఊరుకోం

(మొదటి పేజీ తరువాయి)



సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని శాంబుని కుంట వాస్తవ విస్తీర్ణం 22 ఎకరాలు ఉన్నా, ప్రస్తుతం ఆరేడు ఎకరాలకు పరిమితమైందని, మట్టిపోసి ఆక్రమణలు జరుగుతున్నాయని ఫిర్యాదు అందింది. అమీన్‌పూర్ పెద్ద చెరువులో కూడా భవన నిర్మాణాలు చేపడుతున్నారని, అడ్డుకున్న తమపై దాడులు చేసి, పోలీసు కేసులతో భయపెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే, రోడ్ల ఆక్రమణలపై కూడా ఫిర్యాదులు అందాయి. సాగర్‌రోడ్డులోని యశోదానగర్ కాలనీలో ఇంటి స్థలాల యజమానులు రోడ్డును కలుపుకొని దారి లేకుండా చేస్తున్నారని రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో కాలనీ రోడ్ల మీదుగా తిరగాలంటే కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. మొత్తం 52 ఫిర్యాదులను పరిశీలించిన కమిషనర్ రంగనాథ్, వెంటనే ఆయా విభాగాల అధికారులు రంగంలోకి దిగి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.



# వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్ వ్యవసాయ మార్కెట్ లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆమె కలెక్టర్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.8,110 మద్దతు ధరను నిర్ణయించిందని మంత్రి కొండా సురేఖ వెల్లడిరచారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు తమ పత్తిని నేరుగా సీసీఐ కేంద్రాలకు విక్రయించాలని ఆమె సూచించారు. కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం పేరుతో రైతులను ఎవరైనా ఇబ్బంది పెట్టినా, మోసాలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా, ధైర్యంగా తమ పంటను ప్రభుత్వ కేంద్రాలకు తీసుకురావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



రైతులు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా, వేగంగా సాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతు కష్టం వృథా కాకుండా చూస్తుందని, ప్రతి గింజను సకాలంలో కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**పత్తి కొనుగోలు, తక్షణ సహాయంపై ప్రాధాన్యత**

వరిధాన్యం సేకరణతో పాటు పత్తి కొనుగోలు ప్రక్రియను కూడా యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి నొక్కి చెప్పారు. ఇటీవలి వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల అంశాన్ని ప్రస్తావిస్తూ, వారికి తక్షణ సహాయం అందించడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని స్పష్టం చేశారు. రైతులు పండిరచిన ప్రతి గింజకు న్యాయమైన ధర కల్పించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. రైతు సంక్షేమంపై తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రైతులు దళారుల బారిన పడకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, రైతులకు అండగా నిలవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలియజేశారు.



# కట్టింగ్ మాస్టర్‌గా మారిన సీఎం రేవంత్ రెడ్డి''

(మొదటి పేజీ తరువాయి)

దీక్షిత్‌తో పాటు ఆయన అనుచరులను బీఆర్ఎస్ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రుల పంచాయతీల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి క్యాబినెట్ సమావేశాలు పెట్టుకుంటున్నారని హరీశ్ రావు విమర్శించారు. ఈ సందర్భంగా దక్కన్ యాజమాన్యాన్ని తుపాకీతో బెదిరించిన వ్యవహారాన్ని ప్రస్తావించారు. ఈ కేసులో నిగ్గు తేల్చేందుకు సీబీఐ విచారణకు సిద్ధమా? అంటూ ఆయన సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా సవాల్ విసిరారు. దమ్ముంటే ఈ అంశంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రేవంత్‌పై 'కటింగ్ మాస్టర్' విమర్శ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క భవనం కూడా కట్టలేదని, కానీ 'కటింగ్ మాస్టర్‌గా' మారారని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రారంభించిన సంక్షేమ పథకాలకు కోత (కటింగ్) పెట్టడం, కేసీఆర్ కట్టిన భవనాలకు రిబ్బన్ కట్ చేయడం రేవంత్ రెడ్డి పని అంటూ ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ జిల్లాలో పెండిరగ్ ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ప్రజల సమస్యలపై దృష్టి సారించి, అభివృద్ధి పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# 'డిజిటల్ అరెస్ట్' మోసాలపై సుప్రీం సీరియస్

(మొదటి పేజీ తరువాయి)



ఈ మోసాలపై దేశవ్యాప్తంగా దర్యాప్తులో ఏకరూపత ఉండేలా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విచారణలో భాగంగా, 'డిజిటల్ అరెస్ట్' మోసాలకు సంబంధించి తమ పరిధిలో నమోదైన ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) వివరాలను అందించాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. విచారణ సందర్భంగా, హర్యానా ప్రభుత్వం స్పందిస్తూ... అంబాలా సైబర్ క్రైమ్ బ్రాంచ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కోర్టుకు తెలియజేసింది. సంబంధిత ఇతర ఎఫ్ఐఆర్‌ల వివరాలు సమర్పించేందుకు హర్యానా ప్రభుత్వం కోరిన వారం రోజుల సమయాన్ని ధర్మాసనం అనుమతించింది. ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసాలు కేవలం దేశవ్యాప్తంగానే కాకుండా, దేశ సరిహద్దులు దాటి కూడా జరుగుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడిరది. అందుకే ఇది దేశవ్యాప్త కుంభకోణంగా పరిగణించి, ఈ కేసుల దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ లిలి (సీబీఐ)లిలికి అప్పగించేందుకు మొగ్గు చూపుతున్నట్లు సూచించింది. కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఇలాంటి అనేక కేసులను సీబీఐ ఇప్పటికే దర్యాప్తు చేస్తోందని, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ విభాగం సాంకేతిక సహకారం అందిస్తోందని ధర్మాసనానికి వివరించారు.

**విదేశీ ముఠాల ప్రమేయం**

కేంద్రం తరపున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, ఈ మోసాల వెనుక ఉన్న మనీలాండరింగ్ ముఠాలు విదేశాల నుంచి పనిచేస్తున్నాయని కీలక విషయాన్ని వెల్లడిరచారు. ఈ నేరగాళ్ల నెట్‌వర్క్ ప్రధానంగా భారత్ వెలుపల, ముఖ్యంగా మయన్మార్ మరియు థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ అంతర్జాతీయ కోణాన్ని దృష్టిలో ఉంచుకుని, సమగ్ర దర్యాప్తు కోసం సీబీఐ జోక్యం అవసరం అని కోర్టు భావించడానికి ఇది మరింత బలం చేకూర్చింది.

**తదుపరి విచారణ వివరాలు**

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం, అన్ని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పరిధిలో నమోదైన 'డిజిటల్ అరెస్ట్' సంబంధిత ఎఫ్ఐఆర్‌ల వివరాలను రికార్డుల రూపంలో కోర్టుకు అందించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి అధికారికంగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ నివేదికలు సమర్పించిన తర్వాత, దేశవ్యాప్త కుంభకోణంగా దీనిని పరిగణించి, దర్యాప్తును సీబీఐకి బదిలీ చేయడంపై తదుపరి విచారణ జరగనుంది.

# ప్రయాణికుల సేఫ్టీకి తెలంగాణ ఆర్టీసీ పెద్దపీట..

(మొదటి పేజీ తరువాయి)

మియాపూర్ 1 డిపోలోని లహరి స్లీపర్, లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులను పరిశీలించారు. ఈ బస్సుల్లో అమర్చబడిన ఫైర్ డిటెక్షన్ అలారం, ఫైర్ సప్రెషన్ సిస్టంల వంటి అగ్నిమాపక భద్రతా వ్యవస్థల పనితీరును స్వయంగా పర్యవేక్షించారు.

అంతేకాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అనుసరించాల్సిన స్టాండర్డ్ ప్రోటోకాల్ పద్ధతులను సిబ్బంది, అధికారులతో సమీక్షించారు. బస్సుల్లో ఎమర్జెన్సీ డోర్లు, అద్దాలను పగలగొట్టేందుకు అవసరమైన సంఖ్యలో బ్రేకర్లు, అగ్నిమాపక పరికరాలు అన్ని వేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు నాగిరెడ్డి పలు సూచనలు చేశారు. బస్సులు బయలుదేరే ముందు ప్రయాణికులకు వెల్కమ్ మెసేజ్‌తో పాటు సేఫ్టీకి సంబంధించిన వివరాలు కూడా తెలియజేయాలని సూచించారు. ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే, ముందుగా ప్రయాణికులను కాపాడే ప్రయత్నం చేయాలని తెలిపారు.

ప్రయాణికులకు సురక్షితమైన రవాణా సేవలను నిరంతరం అందించేందుకు సిబ్బంది ఎల్లవేళలా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎండీ అన్నారు. తెలంగాణ ఆర్టీసీ సురక్షిత ప్రయాణాన్ని అందిస్తోందని, సేఫ్ జర్నీతోనే ఎంతోమంది జీవితాలు ఆధారపడి ఉంటాయి అన్న విషయాన్ని ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మరవకూడదని నాగిరెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




# లంకాల దీపక్ రెడ్డితో కలిసి డా. కె. లక్ష్మణ్ పాదయాత్ర

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)





జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ రాజ్యసభ సభ్యులు, జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డా. కె. లక్ష్మణ్ చురుకుగా పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డితో కలిసి ఆయన శ్రీనగర్ కాలనీ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర ఎర్రారెడ్డి గూడ హనుమాన్ దేవాలయం నుంచి ప్రారంభమైంది. ఎర్రారెడ్డి గూడ, ఆర్‌బీఐ క్వార్టర్స్ మరియు ఇంజనీర్స్ కాలనీ ప్రాంతాల మీదుగా సాగింది. స్థానిక నివాసితుల నుంచి ఈ పాదయాత్రకు అనూహ్యమైన ఉత్సాహం, మద్దతు లభించినట్లు డా. కె. లక్ష్మణ్ తెలిపారు. లంకాల దీపక్ రెడ్డి గెలుపు కోసం ప్రజలు ఉత్సాహంగా మద్దతు ఇవ్వడం పట్ల డా. లక్ష్మణ్ ధన్యవాదాలు తెలిపారు. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



## మీనాక్షి నగర్‌లో అభివృద్ధి పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే

**బండారి లక్ష్మారెడ్డి**

**చర్లపల్లి, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ పరిధిలోని మీనాక్షి నగర్‌లో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఆయన కాలనీ ప్రాంతంలో తిరిగి ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు.రోడ్ పనులు నాణ్యతను పరిశీలించి, పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కాలనీ వాసులు డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగానే, వెంటనే అధికారులను ఆదేశించి అవసరమైన పనులు ప్రారంభించమని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ — "మీనాక్షి నగర్‌లో తక్షణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రజల అభ్యర్థనల మేరకు ప్రతి సమస్యను ఒకదాని తర్వాత ఒకటి పరిష్కరిస్తాం," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సురేష్ గుప్త, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు, కాలనీ వాసులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కార్తీక సోమవారం కీసరగుట్ట శివాలయం భక్తులతో కిటకిటలాడింది

**కీసర, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా మేడ్చల్ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం కీసరగుట్ట శ్రీ భవాని శివ దుర్గ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం భక్తజనులతో నిండిపోయింది. వేకువజామునుంచే భక్తులు క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శనం పొందుతున్నారు."హరహర మహాదేవ శంభో శంకర" అనే శివనామస్మరణతో కీసరగుట్ట అంతటా మారుమ్రోగింది. ఆలయం లోపల, వెలుపల ఉన్న శివలింగాల వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగిస్తూ, తమ మనోకామనల నెరవేరాలని భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.కార్తీక సోమవారం శివారాధనకు ఎంతో ప్రాధాన్యం ఉన్నందున, భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. దేవస్థానం అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.కార్తీకమాసం భక్తి, దీపారాధనతో కీసరగుట్ట పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.కార్తీక మాసం మొదలైనప్పటి నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం ఆకాశ దీపం చూసేందుకు భక్తులు ఆసక్తి చూపిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు పేర్కొన్నారు.ఆదివారం 12 వేలకు పైగా భక్తులు స్వామివారి ని దర్శించుకున్నారని. భక్తుల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి తెలిపారు. గత ఏడాది తో పోలిస్తే ఈ సంవత్సరం కార్తీక మాసంలో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు.

## దొంగతనం కేసులో నలుగురు అరెస్ట్

**హసన్ పర్తి, అక్టోబర్ 27,(తెలంగాణ ముచ్చట్లు):** అనేక సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను హసన్ పర్తి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హనుమకొండ ఏసిపి ప్రశాంత్ రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించాడు. హసన్ పర్తి ఎస్సై గోవర్ధన్, దేవేందర్ లు తమ సిబ్బందితో మండలంలోని సీతంపేట క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పాత రైస్ మిల్ వద్ద ఉన్న ముగ్గురు కలుగుల సాయిచంద్(24), రెడ్లం రాకేష్(28), గంపల సాయి తేజ(21) అనే వ్యక్తులు అనుమానాస్పదంగా వ్యవహరించడంతో వారిని విచారించగా వివిధ ప్రదేశాల్లో కాజీపేట,మడికొండ,ధర్మసాగర్,తీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలు,గంజాయి అమ్మకాలు చేసే ప్రవృత్తి కలిగిన వ్యక్తులుగా తేలడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.అదేవిధంగా అదే ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై దేవేందర్ సిబ్బందికి మరో వ్యక్తి ఆలకుంట ఆలియాస్ ముద్దంగుల అనిల్(23) అనే వ్యక్తి అనుమానస్పదంగా కనబడడంతో అతనిని విచారించగా 2018 సంవత్సరం నుంచి ఇప్పటివరకు కాజీపేట,ఉప్పల్,హయత్ నగర్,మర్రిగూడ, భువనగిరి,సుబేదారి,హనుమకొండ,మడికొండ, ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 మోటార్ సైకిల్ దొంగతనాల కేసులు నమోదయి ఉన్నట్లు ఏసిపి ప్రశాంత్ రెడ్డి తెలిపారు.ఈ మధ్యకాలంలో అనిల్ హసన్ పర్తి బస్టాండ్ లోని ఓ బేకరీ ముందు ఉంచిన మోటార్ సైకిల్ సైతం దొంగిలించిన కేసులో నిందితుడు.ఈ కేసుల్లో అనేకమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు ఎసిపి తెలిపారు.నిందితుల నుంచి స్వాధీన పరచుకున్న మోటార్ సైకిల్,మూడు గ్రాములు గంజాయి, హసన్ పర్తి,హనుమకొండ , జనగామ పరిధిలో దొంగతనం చేసిన మోటర్ సైకిల్ లను స్వాధీనపరచుకున్నట్లు ఏసిపి తెలిపారు.ఈ సందర్భంగా హసన్ పర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్,గోవర్ధన్ లతోపాటు క్రైమ్ సిబ్బంది క్రాంతి తదితరులను అభినందించి క్రైమ్ సిబ్బందికి పారితోషకాన్ని అందించాడు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె






**అశ్వారావుపేట, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్థానిక ప్రజలతో కలిసి నిత్యజీవన సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు.
మొదటగా ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ కూలీలకు కొత్త పనిముట్లు అందజేశారు. కూలీలు తక్కువ శ్రమతో ఎక్కువ పని చేయడానికీ సౌకర్యం కల్పించే ఉద్దేశ్యంతో ఈ పనిముట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కూలీల కష్టానికి విలువ ఇవ్వడం, వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడం బాధ్యత అన్న భావాన్ని వ్యక్తం చేశారు.
తరువాత అశ్వారావుపేట బస్టాండ్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వేలేరుపాడు మండల కేంద్రానికి కొత్త బస్సు సర్వీస్ ప్రారంభించారు. జెండా ఊపి బస్సును ప్రారంభించిన తరువాత ప్రజలతోపాటు బస్సులో ప్రయాణం చేశారు. ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరచడం కోసం నియోజకవర్గంలో అవసరమైన చోట మరిన్ని బస్సు సర్వీసులు ప్రవేశపెడతామని తెలిపారు.
మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని భవ్యశ్రీ చదరంగం క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా ఆమెను అభినందించారు. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడం అవసరమని, భవ్యశ్రీ మరింత ఉన్నత శిఖరాలపై నిలిచేలా సహకారం అందిస్తామని తెలిపారు.
గుమ్మడవల్లి కొత్తూరు గ్రామంలో ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట నియోజకవర్గానికి అదనంగా కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. గృహ లేని పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాసం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.
ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసీ అధికారులతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి అష్టోత్తరశత 108 కలశాలతో క్షీరాభిషేకం





**కీసర, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):-** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్.వి. నగర్ రోడ్ నం.8 లో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం భక్తి శ్రద్ధలతో అష్టోత్తరశత (108) కలశములతో క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పాలాభిషేకం చేశారు .ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ కోదండ రామాంజనేయ స్వామి, శ్రీ వల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్య స్వామి, నాగబంధ, మృత్యుంజయ, మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహాలకు క్షీరాధివాసం జరిపారు. ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఈ నెల 29 వరకు కొనసాగుతాయని, అదే రోజు బుధవారం దేవతామూర్తుల ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎం.వి.ఎల్.ఎన్. శాస్త్రి తెలిపారు.కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుబ్రహ్మణ్య శర్మ, సహాయక అర్చకులు జమ్మలమడక శ్రీరమణ శర్మ, ఆలయ అధ్యక్షులు దాచా శ్రీనివాస్ గుప్తా, ఎర్రం ఈశ్వరయ్య గుప్త, లింగా నాగేంద్ర గుప్త, పీవీవీ. సత్యనారాయణ నరసింహస్వామి గౌడ్, గంగిరెడ్డి నరేందర్ రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వరావు, వి. నర్సింహస్వామి గౌడ్, ఆంజనేయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల భూమిని కాపాడాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా






**హన్మకొండ,అక్టోబర్27(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మునిగిపల్లె గ్రామ మహిళా సంఘ సభ్యులు తమకు కేటాయించిన భూములను రక్షించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎల్.హెచ్.పి.ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాయక్, మునిగిపల్లె గ్రామ అధ్యక్షుడు నదునూరి కిషన్ మాట్లాడుతూ - 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం చింతగట్టు రెవెన్యూ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 120C మరియు 120D/1లలో 12 ఎకరాలు 30 గుంటల భూమిని గ్రామైక్య డ్వాక్రా మహిళా సంఘాలకు కేటాయించిందని తెలిపారు. ఆ సమయంలో ఎంఆర్‌ఓ సర్వే చేసి హద్దులు నిర్ణయించారని, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మోటార్ స్తంభాలు ఏర్పాటు చేసి భూమిని సాగుకు అనువుగా మార్చారని వివరించారు. గత 20 సంవత్సరాలుగా మహిళా సంఘాలు ఆ భూమిని సాగు చేసుకుంటూ కాస్తులో ఉన్నప్పటికీ, ఇటీవల చింతగట్టుకు చెందిన నద్దునూరి నాగరాజు ఆ భూమిపై అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. భూమిలోని మోటార్ స్తంభాన్ని ధ్వంసం చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేసి, అందులోని మట్టిని అమ్ముకుంటున్నాడని తెలిపారు.మహిళా సంఘాలకు కేటాయించిన భూమిని కబ్జా చేసిన నాగరాజుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, మహిళా సంఘ సభ్యులకు పట్టా పాస్‌బుక్లు జారీ చేయాలని, భూమిని పూర్తిగా రక్షించాల్సిందిగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు నదునూరి సరోజన, స్వప్న, సులోచన, ఐలమ్మ, స్వరూప, సంధ్య, యమునా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లు ప్రారంభం

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హన్మకొండ,అక్టోబర్27(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. వరి ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటల ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 161 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను ప్రస్తుతం 51 కొనుగోలు నడుస్తున్నాయని అన్నారు. మిగతా 110 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఐకెపి, పిఎసిఎస్ ల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సరిపోను గన్నీ సంచులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమశాతం కొలిచే మీటర్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, ఇతర సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు. వరి దాన్యంలో తేమ 17 శాతం కంటే తక్కువగా ఉండాలన్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 2389, కామన్ గ్రేడ్ కు రూ. 2369 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సన్న రకం వరి దాన్యానికి ప్రభుత్వం రూ. 500 అదనంగా చెల్లిస్తుందన్నారు. వరి ధాన్యం కొనుగోలు ప్రారంభమైన నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు సంబంధిత అంశాలపై కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అంశాలపై కంట్రోల్ రూమ్ నంబర్ 7330751364 ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో మొక్కజొన్న కొనుగోలుకు ఐనవోలు, ఎల్కతుర్తి లో కేంద్రాలను ఏర్పాటు చేసామని, వేలేరు, కమలాపూర్ లోని వ్యవసాయ మార్కెట్, ధర్మసాగర్, వంగ పహాడ్ లలో త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మొక్కజొన్న లో 14% తేమ ఉన్న వాటికి క్వింటాకు రూ. 2400 మద్దతు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. పత్తి కొనుగోలుకు జిల్లాలో 202526 సంవత్సరానికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదన మేరకు పరకాల లోని జిఎం రెడ్డి కాటన్ ఇండస్ట్రీస్, ధనలక్ష్మి కాటన్ మిల్, ఆత్మకూరులోని శ్రీ హనుమాన్ కాటన్ ఇండస్ట్రీస్, వరంగల్ లోని శ్రీకృష్ణ కాటేక్స్ జిన్నింగ్ మిల్లు ద్వారా పత్తిని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పత్తిలో 8 శాతం ఉన్నట్లయితే రూ. 8110, 9 శాతం తేమ ఉంటే రూ. 8029, 10 శాతం తేమ ఉంటే రూ. 7948, 11 శాతం తేమ ఉన్నట్లయితే రూ. 7867, 12 శాతం తేమ ఉన్న పత్తికి రూ. 7786 చెల్లిస్తారని తెలిపారు. జిల్లాలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం, మొక్కజొన్న, పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రైతులకు సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కమిషన్ల కోసం పనిచేసే మంత్రులను భర్తరఫ్ చేయాలి




- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని గెలిచివస్తే మంత్రి పదవి ఇస్తానని మోసం చేశారు
- 3 నెలల్లో ప్రభుత్వం కూలిపోవడం ఖాయం
- తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 27, తెలంగాణ ముచ్చట్లు:** తెలంగాణ రాష్ట్రంలో కమిషన్ల కోసమే పనిచేసే మంత్రులను బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర సోమవారం ఖమ్మం చేరుకుంది. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం కోసం పనిచేయని వారు నేడు మంత్రులుగా కమీషన్ల కోసమే పని చేస్తున్నారని వారిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికై 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు 95శాతం ఉద్యోగాలు కల్పించేలా చట్టం చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలన్నారు. రాజీవ్ యువవికాసం పేరిట 5 లక్షల మంది నిరుద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. అంబేద్కర్ అభయహస్తం పేరిట దళితులకు 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు తులం బంగారం, గృహలక్ష్మీ పథకం క్రింద రూ. 2500లు చెల్లించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ లో గెలిచి వస్తే మంత్రి పదవి ఇస్తానని మోసం చేశారని, మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోబోతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర ఖమ్మం చేరుకుందని, మిగతా జిల్లాల్లో కూడా ఈ యాత్ర కొనసాగుతుందని తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధికార ప్రతినిధి గౌర బీరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోత్కూరి వెంకటాచారి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గంట్యాల నరసింహారావు, కార్యదర్శి నూనె భాస్కరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్.కె జానీ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికంగా పారిశ్రామిక రంగ అభివృద్ధికి గీతాంజలి కాలేజీతో ఎంఓయు ఒప్పందం

**సీఐఏ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి**

**చర్లపల్లి, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఇంజనీరింగ్ విద్యా సంస్థల సహకారంతో పారిశ్రామిక రంగాన్ని సాంకేతికంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం (సిఐఏ) చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోనే తొలిసారిగా చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం కీసర మండలం చీర్యాల గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐఏ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ జి.ఆర్. రవీందర్ రెడ్డి ఎంఓయు పై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా చర్లపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు కావలసిన సాంకేతిక నైపుణ్యంతో కూడిన మ్యాన్‌పవర్‌ను గీతాంజలి కాలేజీ అందించనుంది.ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ — పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం, పరిశ్రమలకు అవసరమైన మ్యాన్‌పవర్ లభించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని కోసం ప్రత్యేకంగా వెబ్ సైట్‌ను రూపొందించి పరిశ్రమలకు అవసరమైన సాంకేతికత, మ్యాన్‌పవర్ వివరాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. విద్యార్థులు ఈ




వెబ్ సైట్ ద్వారా పరిశ్రమలతో నేరుగా సంబంధాలు ఏర్పరచుకుని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని వివరించారు.ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ — ఈ ఎంఓయు ద్వారా ఇరువురికీ ప్రయోజనం కలుగుతుందని, రాష్ట్రంలోని ఇతర పారిశ్రామిక మండలాలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులు పారిశ్రామిక అనుభవాన్ని పొందుతూ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలను పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐఏ సలహాదారు జె. నరేందర్ రెడ్డి, గీతాంజలి విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఆర్. హరిచందర్ రెడ్డి, డైరెక్టర్ ఎస్. ఉదయ్ కుమార్, సీఐఏ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, గంగాధర్ బాబు, రాజు, వీరమోహన్, అవినాష్, అనంత్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ కరాటే అసోసియేషన్ పోటీల్లో సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూలు విద్యార్థుల ప్రతిభ







**పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు**

**ఎల్కతుర్తి, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల నిర్వహించిన జపాన్ కరాటే అసోసియేషన్ ఫోటోకాన్ బెల్ట్ పరీక్షల్లో సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో విద్యార్థిని విద్యార్థులు జి. అక్షర బ్లూ బెల్ట్, అలాగే ఎం. వర్ణిక్ ఆరెంజ్ బెల్ట్ సాధించి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, "విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో చురుకుగా పాల్గొనడం అవసరం. రానున్న రోజుల్లో ఆత్మరక్షణలో కరాటే కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు.ఇదే విద్యార్థులు త్వరలో నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో జరగనున్న నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు.కరాటే మాస్టర్ కవ్వంపల్లి శ్రీనివాస్ విద్యార్థులకు నిబద్ధతతో శిక్షణ ఇచ్చి వారి ప్రతిభను వెలికితీసినందుకు కరస్పాండెంట్ కార్తీక్ రావు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్, హెడ్‌మాస్టర్ మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, లావణ్య, ఆశా బేగం, సురేష్, మమత, కవిత, శ్వేత, అనుష, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి బి.ఎల్.ఓ సమస్యలు పరిష్కరించాలి





**వనపర్తి అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్**

**పెద్దమందడి,అక్టోబర్27(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా వ్యాప్తంగా అంగన్వాడి, బి.ఎల్.ఓల సమస్యలను తక్షణం పరిష్కరించాలని అఖిలపక్ష ఐక్యవేదిక వనపర్తి పిలుపునిచ్చింది. పెద్దమందడి మండల బి.ఎల్.ఓలు తమ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన వినతి పత్రం మేరకు అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధులు ఎమ్మార్వో ను కలసి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈరోజు కొందరు బి.ఎల్.ఓల విజ్ఞప్తి మేరకు అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్ పెద్దమందడి మండల ఎమ్మార్వో కార్యాలయంలో జరుగుతున్న బి.ఎల్.ఓ సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. బి.ఎల్.ఓలకు రావలసిన వేతనాలు వెంటనే చెల్లించాలి. అదనపు పనులు చేయిస్తూ, వారికి రావలసిన డబ్బులు ఇవ్వకపోవడం సరైంది కాదు. మహిళలతో శ్రమదోపిడీ చేయిస్తూ ఇతర పనులు చేయించడం న్యాయం కాదు. కలెక్టర్ గారి ఉత్తర్వుల పేరుతో ఇతర పనులు చేయిస్తూనే చెల్లింపులు నిలిపివేయడం తక్షణం ఆపాలి అని డిమాండ్ చేశారు.బి.ఎల్.ఓల సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా. సతీష్ యాదవ్, పెద్దమందడి అధ్యక్షుడు నక్క కృష్ణ యాదవ్, నాగవరం వెంకటేశ్వర్లు, పెద్దమందడి బి.ఎల్.ఓలు, అంగన్వాడీ టీచర్లు, వనపర్తి పట్టణ అధ్యక్షుడు రామస్వామి, కొత్త గొల్ల శంకర్, రాజనగరం రవి, శివకుమార్, ఎన్. సురేష్, ఏ. ఉదయ్, జి. సురేష్, ఎన్. కురుమూర్తి, టి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలకు ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి పరామర్శ





**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 27, తెలంగాణ ముచ్చట్లు;** నగర పరిధిలో పలు కుటుంబాలను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం పరామర్శించారు. రఘునాథపాలెం మండల పరిధిలోని చింతగుర్తి గ్రామంలో మాజీ సర్పంచ్ తమ్మినేని నాగేశ్వరరావుకు ఇటీవల శస్త్ర చికిత్స జరగగా.. వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, నాయకులు కాపా ఆదినారాయణ, దీప్లా, కొమురయ్య, కేతినేని సీతారామయ్య, సురగాని గోపయ్య, బాగం లక్ష్మీనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ముస్తఫా నగర్ లో.. మటన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ మోహినుద్దీన్ తల్లి ఇటీవల చనిపోగా.. వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎంపీ రఘురాం రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటామని అభయమిచ్చారు. 18వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ నివాసానికి వెళ్ళి..ఇటీవల కంటి ఆపరేషన్ జరిగిన ఆయనను ఎంపీ రఘురాం రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో.. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, చల్లా ప్రతిభారెడ్డి, టీపీసీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, నాయకులు ఒంటికొమ్ము శ్రీనివాసరెడ్డి, మందడపు నాగేశ్వరరావు, చల్లా రామకృష్ణారెడ్డి, మైనారిటీ నాయకులు మాజీద్, గురుమూర్తి, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాల సందర్భంగా సైకిల్ ర్యాలీ నిర్వహణ

**కాప్రా, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ అమరవీరుల స్మారక ఉత్సవాల లో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం సైకిల్ ర్యాలీ విజయవంతంగా నిర్వహించారు. ఈ ర్యాలీ ఉదయం 6:30 గంటలకు ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ వద్ద ప్రారంభమై, ఏ ఎస్ రావు నగర్ సిగ్నల్ వరకు వెళ్లి తిరిగి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ వద్ద ముగిసింది.కుషాయిగూడ ఏసిపి వై. వెంకటే రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు ఎన్. సుధాకర్ రెడ్డి, ఎన్. వెంకన్న, సతీష్, విజయ్ తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాఫల్యంగా జరిగింది.



విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనడం ద్వారా ర్యాలీకి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా ఏసిపి వెంకటే రెడ్డి మాట్లాడుతూ — "దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకోవడం మన అందరి బాధ్యత. వారి సేవా త్యాగాలను గుర్తు చేస్తూ, సమాజంలో పోలీసుల పట్ల గౌరవ భావం పెంచడమే ఈ ర్యాలీ ఉద్దేశ్యం" అని తెలిపారు.కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించిన పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలకు అధికారులు ధన్యవాదాలు తెలిపారు.




## సీపీఐ శతజయంతి వర్క్‌షాప్ గోడపత్రిక విడుదల

**డిసెంబర్ 12-14 వరకు రాష్ట్ర స్థాయి ఏఐవైఎఫ్ వర్క్‌షాప్**

**హిమాయత్‌నగర్, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతజయంతి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 12 నుండి 14 వరకు హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మూడు రోజులపాటు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌కు సంబంధించిన గోడపత్రికను హిమాయత్‌నగర్‌లోని మక్దూమ్ భవన్‌లోని రాజ్ బహదూర్ హాల్‌లో ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో స్థాపించబడి, అప్పటినుంచి సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు పోరాటం సాగిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంఘాల ఏర్పాటు ద్వారా కార్మికులు, కర్షకులు, యువజనులు, విద్యార్థులు, మహిళలు, మేధావులు, కవులు, కళాకారులు, దళిత బహుజనుల చైతన్యానికి సీపీఐ ముఖ్య పాత్ర పోషించిందని తెలిపారు. దేశంలో యువజన వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నిరసన వ్యక్తం చేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక వనరులు మెరుగుపడేలా ఉద్యమాలను నిర్మించడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. సీపీఐ 100 ఏళ్ల చరిత్రను ప్రజలకు పరిచయం చేసి, ప్రజా బాహుల్యంలో ఎర్రజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు ఏఐవైఎఫ్ కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు బిజ్జ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, లింగం రవి, శ్రీమాన్, చేపూరి కొండల్, కార్యవర్గ సభ్యుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## జవహర్ నగర్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో సైకిల్ ర్యాలీ

**జవహర్ నగర్, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు (ఐపీఎస్) ఆదేశాల మేరకు, పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జవహర్ నగర్ పోలీస్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ఫైరింగ్ కట్ట వరకు కొనసాగి, మార్గమంతా పోలీస్ అమరవీరుల జ్ఞాపకార్థం నినాదాలు, జాతీయ జెండాలతో కదిలింది. విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జవహర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య మాట్లాడుతూ "రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నాం. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగం స్ఫూర్తిదాయకం. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాం" అన్నారు.ర్యాలీలో ఎస్సైలు ఇద్రిస్ అలీ, రాము నాయక్, వేణుమాధవ్, మౌనికతో పాటు జవహర్ నగర్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన ఖమ్మం ఎంపీ

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 27, తెలంగాణ ముచ్చట్లు;** నగరంలోని సువర్ణ యంత్ర సహిత శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు. కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేంద్ర, నూతన శివాలయ నిర్మాణ కమిటీ బాధ్యులతో కలిసి.. ప్రాంగణంలో కలియ తిరిగి నిర్మాణ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# లాటరీ ద్వారా పారదర్శకంగా మద్యం షాపుల కేటాయింపు ఖరారు...





**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -27, తెలంగాణ ముచ్చట్లు:** లాటరీ పద్ధతి ద్వారా పారదర్శకంగా జిల్లాలో మద్యం షాపులు కేటాయించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక సీక్వెల్ రిసార్ట్స్ లో నిర్వహించిన మద్యం (ఏ4) షాపుల కేటాయింపు ప్రక్రియలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 116 ఏ4 మద్యం షాపుల్లో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు గౌడ కులస్థులకు 18, ఎస్సీలకు 14, ఎస్టీ లకు 8 రిజర్వ్ చేయగా, మిగతా 76 షాపులను ఓపెన్ టు ఆల్ గా కేటాయించి, అన్ని షాపులకు లాటరీ ద్వారా కేటాయింపులు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 116 ఏ4 మద్యం షాపులకు గాను 4430 దరఖాస్తులు వచ్చాయని, అధికంగా గెజిట్ సీరియల్ నెం. 27 నకు 75, అత్యల్పంగా గెజిట్ నెం.లు 73, 75 లకు 24 చొప్పున దరఖాస్తులు అందినట్లు తెలిపారు. దరఖాస్తుదారుల సమక్షంలో ప్రతి షాపుకు లక్కీ డ్రా తీస్తూ, పారదర్శకంగా లాటరీ పద్ధతిన మద్యం షాపుల కేటాయింపు ఖరారు చేశామన్నారు. ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా మద్యం షాపుల కేటాయింపు మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. లక్కీ డ్రాలో అదృష్టం వరించి, మద్యం షాపులను దక్కించుకున్నవారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పెద్ద సంఖ్యలో దరఖాస్తుదారులు, మద్దతుదారులు హాజరుకావడంతో టోకెన్ కలిగి ఉన్న వారినే లోనికి అనుమతించారు. వచ్చినవారికి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరం తదితర సదుపాయాల కల్పన చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా రిసార్ట్ తో పాటు, పరిసర ప్రాంతాల్లోనూ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మద్యం షాపుల కేటాయింపు లక్కీ డ్రా ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి. జనార్ధన్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. నాగేంద్ర రెడ్డి, సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు వేణుగోపాల్ రెడ్డి, తిరుపతి, ఎక్సైజ్ సిఐ కృష్ణ, ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత





**బి.ఆర్.ఎస్ జిల్లా నాయకులు పానుగంటి సురేష్ కుమార్**

**పెద్దమందడి,అక్టోబర్27(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామానికి చెందిన చిట్టి, కొము కిష్టయ్య (మాదిగ) అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబాలు కావడంతో మృతుల కుటుంబాలకు బి.ఆర్.ఎస్ పార్టీ తరఫున జిల్లా నాయకులు పానుగంటి సురేష్ కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. చిట్టి చిన్న వయసులోనే మరణించడం బాధాకరమని, అలాగే అనారోగ్యంతో కొద్దిరోజులుగా పోరాడి నిన్న జిలకర నాగన్న కుమార్తె మరణించిన విషాద సంఘటన పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న సురేష్ కుమార్ స్వయంగా ఆ కుటుంబాలను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. దశదినకర్మ ఖర్చుల కోసం రెండు కుటుంబాలకు భారత రాష్ట్ర సమితి పార్టీ తరఫున ఆర్థిక సాయం అందజేశారు.

# ఘనంగా భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు





- వల్భాపూర్ శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో విశేష వేడుకలు
- శ్రీ పశుపతినాథ్ స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి.

**ఎల్కతుర్తి, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీకమాస సోమవారం సందర్భంగా వల్భాపూర్ గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 6 గంటలకు గణపతి పూజతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పంచామృత రుద్రాభిషేకాలు, సామూహిక అభిషేక-అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మొక్కలు చెల్లించుకుంటూ, దీపాలు వెలిగిస్తూ భక్తి వాతావరణం నెలకొంది.
ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి (ధూపదీప నైవేద్య సంఘం ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు) నేతృత్వంలో నిర్వహించారు.
కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంజి భావనఋషి, సభ్యులు శ్రవణ్ కుమార్, లింగారావు, విష్ణుమూర్తి, తరుణ్, విజయ్, మహేందర్, విజయశ్రీ, మమత, శ్రీదేవి, స్వరూప, రజిత, వీణ శ్రీతో పాటు అనేకమంది భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చట్ పూజ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్



**పన్నాల దేవేందర్ రెడ్డి**

**మల్లాపూర్, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ నగర్‌లో సోమవారం రోజు చట్ పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు సూర్యదేవునికి అర్పణలు సమర్పించి ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ — "చట్ పూజ వంటి సాంప్రదాయ వేడుకలు భారతీయ సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకలు. భక్తి, సమైక్యతతో ఇలాంటి పూజలు జరపడం ఆనందదాయకం" అన్నారు. దేవేందర్ రెడ్డి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించి, భక్తులందరికీ చట్ పూజ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజు రాయి, కాశప్, చత్రుధన్, సందీప్, వివేక్‌తో పాటు స్థానిక నాయకులు వాసుదేవ్ గౌడ్, తీగుళ్ల శ్రీనివాస్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మొంథా తుఫాను దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలి...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -27, తెలంగాణ ముచ్చట్లు;** మొంథా తుఫాను దృష్ట్యా అప్రమత్తంగా ఉండి, రానున్న రెండు, మూడు రోజుల పాటు పంట కోతలు చేయవద్దని జిల్లా కలెక్టర్ రైతులను కోరారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, మొంథా తుఫాన్ దృష్ట్యా ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు రాబోయే 2 నుంచి 3 రోజుల పాటు పంట కోతలు చేపట్టవద్దని తెలిపారు. పంట నష్టం వాటిల్లకుండా ఉండేందుకు పంట కోతలను రైతులు 3 రోజులు వాయిదా వేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# రైతు సంక్షేమానికి ప్రాధాన్యం



## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం

**వేలేరు,అక్టోబర్27(తెలంగాణ ముచ్చట్లు):** వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. వేలేరు మండలంలోని పీచర గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు.రైతులు దళారుల వద్ద నష్టపోవద్దనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు ధాన్యం కొనుగోలు చేయకపోతే, తెలంగాణలో మాత్రం ప్రభుత్వం రైతుల నుండి నేరుగా కొనుగోలు చేస్తోందని చెప్పారు. ఈ సీజన్‌లో మద్దతు ధరతో పాటు బోనస్ మొత్తాన్ని కూడా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు.

సన్న రకం ధాన్యానికి 2,389 రూపాయలు, సాధారణ రకానికి 2,369 రూపాయల మద్దతు ధరను నిర్ణయించారని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తేమ శాతం 17 లోపు ఉండాలని, ప్రతి బస్తా 41 కిలోలకు మించరాదని సూచించారు. మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలోనే ధాన్యం అమ్మాలని, దళారుల వద్దకు వెళ్లి నష్టపోవద్దని సూచించారు. కేంద్రాల్లో త్రాగునీరు, విద్యుత్ లైట్లు, క్లీనింగ్ మిషన్, మయిశ్చర్ మిషన్, టార్పాలిన్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు మహిళా సంఘాల ఆధ్వర్యంలోనే ఈ కేంద్రాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ, 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు పెట్టుబడి సాయం అందించడం చారిత్రాత్మకమని అన్నారు. సన్నలకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజా సంక్షేమానికి నిదర్శనమని చెప్పారు.గత పాలకులు ప్రజా ప్రయోజనాల కన్నా స్వప్రయోజనాలను మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి నియోజకవర్గ అభివృద్ధినే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నానని అన్నారు. రెండు సంవత్సరాల్లో రూ.1,388 కోట్ల నిధులను తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. వేలేరు మండలం పీచర గ్రామంలో రూ.83 లక్షల సిసి రోడ్లు, 65 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రెండవ విడతలో మరో 50 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా పీచర-వేలేరు వైయా శాలపల్లి రోడ్డుకు రూ.6 కోట్లు, పీచర-కొమ్ముగుట్ట రోడ్డుకు రూ.3 కోట్లు, పీచర-వావిల్లకుంట తండా రోడ్డుకు రూ.1.42 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు.

ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు కొనసాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, సివిల్ సప్లై డీఎం, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డబ్బు లేకుండా జీవించడం సాధ్యమే





- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు
- పల్లెల్లో డబ్బు చేసే చిత్రాలపై సర్వేకు నిర్ణయం

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 27, తెలంగాణ ముచ్చట్లు;**

మనుషులు డబ్బు లేకుండా జీవించడం సాధ్యమేనని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం రాత్రి చొప్పకట్లపాలెం గ్రామంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నాడునేడురేపు అనే అంశంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. బోయినపల్లి పున్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ స్టడీ సర్కిల్ లో పల్లా కొండలరావు మాట్లాడుతూ జీవించేందుకు మనిషి అవసరాలు తీర్చే వస్తువులు అవసరం తప్ప డబ్బు కాదన్నారు. ఊపిరికి గాలి, దాహానికి నీరు, ఆకలికి ఆహారం, కూర్చోవడానికి కుర్చీ ఇలా అనేక వస్తువులు అవసరంతో మనిషి అవసరాలు తీరతాయన్నారు. ఒకప్పుడు గ్రామంలో డబ్బు అవసరం లేకుండానే వస్తు మార్పిడితో అందరి అవసరాలు తీరిన పరిస్థితి ఉందన్నారు. డబ్బు వచ్చాకనే మనిషి మనసులో కొత్త జబ్బులు వచ్చాయన్నారు. డబ్బుతో వచ్చిన జబ్బు వల్ల మనిషి మనసుకే కాక అనేక రకాలుగా పతనం జరిగిందన్నారు. మానవ సంబంధాలు, విలువలు దిగజారిపోయాయన్నారు. డబ్బు వచ్చాక పనికి మాలిన పనులు, జల్సాలు, అనవసరపు వస్తువులు, విచ్చలవిడితనం పెరిగాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదవారు కూడా తాహతుకు మించి అప్పులు చేసి వాటిని తీర్చలేక నానా అవస్థలు పడుతున్నారని, వాస్తవిక జీవితాన్ని, ఆనందాలను కోల్పోయి రేయింబవళ్ళు ఇంటిళ్ళపాది కష్టం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని చెప్పారు. డబ్బు పిచ్చి మనిషి ఆరోగ్యాన్ని కూడా క్షీణింపజేస్తోందన్నారు. మనిషుల్ని విడగొట్టే, ఆధిపత్యాలను అంతరాలను పెంచే డబ్బు సమస్య పరిష్కారం కావాలంటే సమిష్టి జీవన విధానం ఉండే సమాజం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మరో ప్రపంచం అసాధ్యం కాదని తెలిపారు. మానవీయ విలువల్ని, మనుషుల మధ్యను ఐక్యతను పెంచే మరోప్రపంచంలో ప్రకృతి, ప్రజలు పదిలంగా ఉంటారనీ, దీనిని మనుషుల చైతన్యం పెంచడం ద్వారా సుసాధ్యం చేసుకోవచ్చన్నారు.

పల్లెల్లో కొత్త అప్పులపై సర్వేకు నిర్ణయం

పల్లెల్లో డబ్బు చేస్తున్న విచిత్రాలపై పల్లెప్రపంచం స్టడీ సర్కిల్ సభ్యులందరూ సర్వే చేయాలని నిర్ణయించారు. ఏ పనీ లేకుండా, ఉత్పత్తి సృష్టించకుండా వారాలు, ఈ.ఎం.ఐ ల పేరుతో కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న కొత్త కొత్త పద్ధతుల ద్వారా ప్రశాంతమైన పల్లె జీవనంలో అలజడి సృష్టిస్తున్న అంశాలపై బాధ్యులు సర్వే చేయాలని, తదుపరి స్టడీ సర్కిల్ లో సభ్యులు తాము చేసిన సర్వే అంశాలను వెల్లడించాలని నిర్ణయించారు. సర్వేలో తేలిన అంశాలపై ప్రజలలో చైతన్యం పెంచేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పల్లెప్రపంచం ఫౌండేషన్ కార్యదర్శి బోయినపల్లి అంజయ్య, కోశాధికారి కొండేటి అప్పారావు, సభ్యులు మార్కపుడి బ్రహ్మం,రచ్చా మధు, స్టడీ సర్కిల్ ఇంచార్జిలు దారెల్లి వెంకటేశ్వర్లు, పరిటాల కొండలరావు, బొప్పాల రమేష్, చలమల హరికిషన్ రావు, నిమ్మతోట మోహన్ రావు, బోయినపల్లి సరవయ్య, కస్తాల చందు పాల్గొన్నారు.

# టాటా మోటార్స్ లాభాలు ఆకాశాన్నంటిన త్రైమాసిక ఫలితాలు విడుదల




దేశంలో ఆటోమొబైల్ రంగం మరోసారి పుంజుకుంది. టాటా మోటార్స్ తాజాగా ప్రకటించిన రెండవ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కంపెనీకి చరిత్రాత్మక స్థాయిలో లాభాలను చూపించాయి. సెప్టెంబర్ 2025తో ముగిసిన త్రైమాసికంలో సంస్థ నికర లాభం ?6,145 కోట్లకు చేరింది. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో నమోదైన ?3,250 కోట్లతో పోలిస్తే దాదాపు రెండిరతల పెరుగుదల. వాహనాల అమ్మకాలు గణనీయంగా పెరగడం, ముఖ్యంగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ అంతర్జాతీయ మార్కెట్లలో బలంగా రాణించడం కంపెనీ లాభాలను పెంచిన ముఖ్య కారణంగా భావిస్తున్నారు. దేశీయంగా కూడా ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ గణనీయంగా పెరగడంతో టాటా మోటార్స్ మార్కెట్ వాటా విస్తరించింది. కంపెనీ సీఈఓ ప్రకారం, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సామర్థ్యాన్ని మరింత పెంచే ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అలాగే, 2026 నాటికి కొత్త ఈవీ మోడళ్లను మార్కెట్లో ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు వెల్లడిరచారు. మదుపర్ల ప్రతిస్పందన సానుకూలంగా ఉండటంతో టాటా మోటార్స్ షేర్ ధరలు బీఎస్ఈలో 4 శాతం వరకు ఎగిశాయి. విశ్లేషకులు రాబోయే త్రైమాసికాల్లో కూడా ఈ స్థిరమైన వృద్ధి కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఆటో రంగం మొత్తానికి ఇది బలమైన సంకేతమని నిపుణులు వ్యాఖ్యానించారు.

# సమాజాన్ని కలచివేసిన బస్సు దుర్ఘటన



## చిన్న తప్పు పెద్ద విషాదాన్ని మిగిలించింది

**కీసర, అక్టోబర్ 27 (తెలంగాణ ముచ్చట్లు):** కర్నూల్ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం యావత్ సమాజాన్ని తీవ్రంగా కలచివేసిందని ఎన్‌బిఎంఐ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు రవి రాజ్ రాథోడ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కీసర కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ — ఈ దుర్ఘటనలో నిరపరాధులైన ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని తెలిపారు.“చిన్న తప్పులు, క్షణిక నిర్లక్ష్యం ఎంతటి పెద్ద విషాదానికి దారితీస్తుందో ఈ ఘటన మరోసారి మనకు గుర్తు చేసింది,” అని రవి రాజ్ రాథోడ్ పేర్కొన్నారు. ప్రతి డ్రైవర్ జాగ్రత్తగా ఉండి ట్రాఫిక్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. వాహనం నడిపే ప్రతీ వ్యక్తి ట్రాఫిక్ నియమాలను కేవలం చట్టబద్ధత కోసమే కాకుండా మానవతా బాధ్యతగా భావించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచే దిశగా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కలసి కృషి చేయాలని పిలుపు నిచ్చారు.“ మన జాగ్రత్తే మన ప్రాణాలకు రక్షణ” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరు గుండెల్లో ముద్రించు కోవాలని రవి రాజ్ రాథోడ్ తెలిపారు.

# రిలయన్స్ రిటైల్ కొత్త పెట్టుబడి ఒప్పందం గ్లోబల్ ఫండ్‌లతో భారీ డీల్

రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ మరోసారి అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించింది. అమెరికాకు చెందిన గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ “క్లేటన్ డుబిలియర్ రైస్” మరియు సింగపూర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కలసి రిలయన్స్ రిటైల్‌లో ?12,000 కోట్ల పెట్టుబడికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ డీల్‌తో కంపెనీ విలువ ?9.2 లక్షల కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మాట్లాడుతూ, ఈ పెట్టుబడితో రిటైల్ వ్యాపార విస్తరణకు ఊతం లభిస్తుందని, ప్రత్యేకంగా గ్రామీణ మార్కెట్లలో మరింత దూకుడుగా అడుగులు వేయనున్నామని తెలిపారు. ఈ పెట్టుబడులు సాంకేతికత, సరఫరా గొలుసు అభివృద్ధి, డిజిటల్ సేవల విస్తరణకు వినియోగించనున్నట్లు వివరించారు. ఇదిలా ఉంటే, రిలయన్స్ రిటైల్ గత ఆర్థిక సంవత్సరంలో ?3.2 లక్షల కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. కంపెనీకి భారత్ అంతటా 19,000కి పైగా రిటైల్ స్టోర్లు ఉన్నాయి. డిజిటల్ కామర్స్ విభాగం, జియోమార్ట్ ద్వారా కూడా గణనీయమైన ఆదాయం వస్తోంది. విశ్లేషకుల అంచనాల ప్రకారం, ఈ కొత్త పెట్టుబడి ఒప్పందం రిలయన్స్ రిటైల్‌ను ఆసియా మార్కెట్‌లో అత్యంత విలువైన రిటైల్ సంస్థగా నిలబెట్టే అవకాశం ఉంది.అంతేకాదు, రాబోయే మూడు సంవత్సరాల్లో కంపెనీ ఆదాయాలు మరో 25 శాతం పెరిగే అవకాశం ఉందని వారు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# చెప్పులు లేకుండా నడవడమే ట్రెండ్..



పాటల విషయంలో,వస్తువుల విషయంలో, ఫుడ్ విషయంలో ఇలా చాలా విషయాల్లో కూడా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటారు. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లాలి అన్నా సరే ఇంటికి ఒక బైక్, లేదా కార్ వంటివి ఉన్నాయి. ఇక రోడ్డు మీద బస్ లు, రైల్వే ట్రాక్ లు, విమానాలు చాలా ఉన్నాయి. పైసామే పరమాత్మ అన్నట్టుగా డబ్బులను బట్టి లగ్జరీగా ఉండవచ్చు. కానీ పూర్వం మన భారత దేశంలో ఎవరు ఎక్కడికి వెళ్ళలనుకున్నా కాళ్లతో నడుస్తూనే వెళ్లేవారు. మరి నడవడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా? రాను రాను నడక పూర్తిగా తగ్గిపోయింది. కేవలం వాకింగ్, జాగింగ్ చేసేవారు మాత్రం పెరిగిపోతున్నారు.అయితే వీటికోసం కూడా ఎన్నోరకాల చెప్పులు, షూస్ అందుబాటులోకి వచ్చాయి.అవసరానికి అనుగుణంగా చెప్పులు, షూలు వచ్చాక డబ్బులు పెట్టి అందమైనవి కూడా కొంటున్నారు. ఇదిలా ఉంటే కాలి నడక ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో ట్రెండ్ గా మారింది. ఒక వ్రతం లాగా దీన్ని పాటిస్తున్నారు అంటే నమ్ముతారా?. కొందరు మార్నింగ్ వాక్ కోసం కాలి నడకని ఎంచుకుంటే.. మరికొందరు చెప్పులు లేకుండా నడవాలి అని కోరుకుంటున్నారు. మన దగ్గర ఇప్పటికే ఇలా చాలా మంది అలవాటు చేసుకున్నారు. ఆరోగ్యం కోసం చాలా మంది పాత పద్ధతులనే వాడుతున్నారు. ఇందులో భాగంగా చెప్పులు లేకుండా భూమి స్పర్శను పొందడం అనేది మెల్లిమెల్లిగా మన దేశంలో చాలా మంది అలవాటు చేసుకుంటున్నారు. సామాన్య ప్రజలు మాత్రమే కాదు ప్రముఖులు కూడా ఇదే పని చేస్తున్నారు. ఇప్పుడు కొంతమంది సెలబ్రిటీలు పాదాలతో నడవడం గమనిస్తే ఈ విషయం చాలా అర్థం అవుతుంది. ఇలా ఎవరు ఎక్కడ చెప్పులు లేకుండా నడిచినా వాటి ఉపయోగాలు మాత్రం చాలా ఉన్నాయి అంటున్నారు నిపుణులు.

ప్రకృతి స్పర్శను అనుభవించాలి అంటే నేలను తాకాలట. నేల తగిలేలా కాలు కింద పెట్టి భూమికి ఉన్న రకరకాల స్వభావాలు తాకుతూ ఉంటే ప్రకృతితో ఒక బంధం ఏర్పడుతుంది అంటారు ప్రకృతి ప్రియులు. కాలి నడక వల్ల భూమిలోని నెగిటివ్ ఎనర్జీ శరీరంలోకి ప్రవేశిస్తాయి. మన నిత్యం వాడే ఎలక్ట్రానిక్ పరికరాల వల్ల శరీరంలో పేర్కొన్న అయాన్లను ఇవి బ్యాలెన్స్ చేస్తాయి అంటున్నారు నిపుణులు. ఇలా బ్యాలెన్స్ అవడం వల్ల శరీరంలో ఉన్న వాపులు తగ్గుతాయట. ఇలా జరగడం వల్ల నిద్ర కూడా బాగా పడుతుందట. చెప్పులు లేకుండా నడవడం వల్ల పాదాలలో ఉండే నరాలు క్రమబద్ధంగా తాకిడికి గురై దానివల్ల ఒత్తిడి దూరమయ్యే ఛాన్స్ కూడా ఉందట. శరీరం పూర్తిగా సేద తీరిన భావన కలుగుతుంది. ఇలా నడవడం వల్ల రక్త ప్రసరణ బాగా జరుగుతుందని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. పాదంపై ఒత్తిడి పెంచడం వల్ల రక్తప్రసరణలో చురుకుతనం వస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుంది.



# సరైన నిద్ర లేదా? మీరు డేంజర్‌లో ఉన్నట్టే..

ప్రస్తుతం చాలా మంది నిద్రలేమి సమస్యతో బాధ పడుతున్నారు. నైట్ డ్యూటీలు, రాత్రి ఫోన్ లు, పార్టీలు అంటూ నిద్ర పోకుండా మెలుకువతో ఉంటున్నారు. దీని వల్ల తర్వాత కూడా నిద్ర పట్టడం లేదు. అయితే నిద్ర లేకపోవడం వల్ల, నిద్రలేమి సమస్య సులభంగా వస్తుంది. దీని వల్ల గుండె సమస్య కూడా వస్తుంది. అంతేకాదు మానసిక, శారీరక సమస్యలు.. సహా పలు తీవ్ర వ్యాధులకు కారణం కూడా అవుతుంది. వాస్తవానికి ఆరోగ్యంగా ఉండాలంటే.. 7 నుంచి 8 గంటలపాటు నిద్రపోవాలి.. మరి మీకు సరైనా నిద్ర లేకపోతే ఎలాంటి ప్రమాదాలు, వ్యాధులు వస్తాయో తెలుసుకోండి. ఎవరైనా 8 గంటలు నిద్రపోకపోతే, శరీరంలో కార్టిసాల్ హార్మోన్ పెరగడం ప్రారంభమవుతుంది అంటున్నారు నిపుణులు. దీంతో గుండెపై ఒత్తిడి పెరుగుతుందట. తద్వారా రక్తపోటు పెరిగి.. ఇది గుండె జబ్బులకు దారి తీస్తుంది. అంటే గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల వాపు, ఒత్తిడిని పెంచే హార్మోన్లు శరీరంలో పెరుగుతాయి అంటున్నారు నిపుణులు. ఈ వాపు ధమనికి హాని కలిగిస్తుందట. దీని వల్ల కూడా గుండె జబ్బులు పెరుగుతాయట. నిద్ర లేకపోవడం వల్ల, గుండె కొట్టుకోవడం సక్రమంగా ఉండదని.. చప్పుడులో మార్పు సంభవించే ప్రమాదం ఉంది అంటున్నారు నిపుణులు. దీనిని అరిథ్మియా అని పిలుస్తారట. ఇది గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుందని.. అందుకే రాత్రి పూట వీలైనంత త్వరగా పడుకోవాలి అని సలహా ఇస్తున్నారు వైద్యులు. రాత్రి పూట మెలుకువగా ఉంటే తినడం కూడా బాగా అలవాటు అవుతుంది. దీని వల్ల ఆకలి కూడా పెరుగుతుంది. ఇలా జరగడం వల్ల తినడం, ఆ తర్వాత ఉచితంగా ఊబకాయం రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. గుండె జబ్బులకు ప్రధాన కారణం అధిక బరువు.. కావున జీవనశైలిలో మార్పు చేసుకుంటే ఈ గుండె జబ్బులు కూడా తక్కువ అవుతాయి.

# ఆపిల్స్ తీసుకునేటప్పుడు జాగ్రత్త..



ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఒక ఆపిల్ తినాలి అంటారు నిపుణులు. దీనిలో చాలా పోషకాలు ఉంటాయి. కొందరు ఏకంగా వీటిని బ్రేక్‌ఫాస్ట్‌లో తింటారు. ఆపిల్స్ లో ఎక్కువగా ఫైబర్, విటమిన్స్ ఉంటాయి. ఇవి శరీరాన్ని ఎన్నో సమస్యల నుంచి కాపాడుతుంటాయి. అంతేకాదు రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. కానీ ఆపిల్స్ కదా అని ఏవి పడితే అవి తినకూడదు. చూసి మంచివి తీసుకోవాలి. సరైనవి తింటేనే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇంతకీ మంచి వాటిని ఎలా గుర్తించాలో తెలుసా? ఓ సారి చూసేయండి.. రుచికరమైన ఆపిల్స్ తినాలి అనిపిస్తే కొనేటప్పుడు అవి చిన్న పరిమాణంలో, సాధారణ బరువు ఉండేలా చూడండి. ఎందుకంటే, పెద్దగా ఉండే యాపిల్స్ త్వరగా చెడిపోయే అవకాశం ఉంటుంది. అదే విధంగా, ఎక్కువగా బరువుగా ఉండే ఆపిల్స్ కూడా మంచివి కాదంటారు నిపుణులు.ఆపిల్స్ సాధారణంగా ఎరుపు, లేత పసుపు, ఆకుపచ్చ రంగుల్లో లభిస్తుంటాయి. చాలా మంది రెడ్ కలర్ ఆపిల్స్‌కి అట్రాక్ట్ అవుతుంటారు. కానీ, లేత ఎరుపు, ఆకపచ్చ, మిక్స్డ్ కలర్ ఆపిల్స్ రెడ్ కలర్ ఆపిల్స్ కంటే తియ్యగా, రుచిగా ఉంటాయి కాబట్టి వీటికే ఎక్కువ ఓటు వేస్తారు. ఆకుపచ్చ ఆపిల్స్ పచ్చిగా ఉండటమే కాదు కాస్త పుల్లగా కూడా ఉంటాయి. పసుపు రంగులో ఉండే ఆపిల్స్ తియ్యగా ఉంటాయి. జ్యూస్ కు కూడా ఇవి బాగుంటాయి. వాసన చూడటం వల్ల కూడా ఆపిల్స్ బాగున్నాయో లేదో తెలుసుకోవచ్చు. స్వీట్ ఆపిల్ అయితే మంచి వాసన వస్తుంది అంటారు నిపుణులు. వాసన సరిగా రాకపోతే వాటిని తీసుకోకూడదు. అయితే, కొన్ని సందర్భాల్లో యాపిల్ వాసన చూసి రుచిని గెస్ చేయడం కూడా కష్టం కావచ్చు. ఓ పండు బాగుందా లేదా అనేది వాటిని చూసి తీసుకోవడంలో కొందరు ఎక్స్ పర్ట్ లు ఉంటారు. వాటిని తాకినప్పుడు గీతలు, చారలు కనిపిస్తుంటాయి. అదే విధంగా కనిపించని మచ్చలు కూడా వాటిని తాకినప్పుడు తెలుస్తుంటాయి. కాబట్టి అలాంటి వాటిని కొనొద్దు.



# ఈ ఆకులు తింటే మోకాళ్ల నొప్పులు దెబ్బకి పరార్..!

చాలామంది ఆయుర్వేద నిపుణులు ఎక్కువగా మన చుట్టూ ఉంటే పరిసరాలలో లభించే మొక్కల ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వాటిని ఉపయోగిస్తూ ఉంటారు. అయితే కొన్ని మొక్కల ఆకులను తినడం వల్ల యూరిక్ యాసిడ్ వంటి సమస్యలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు సైతం తెలియజేస్తూ ఉంటారు.అలా ఇప్పుడు మోకాళ్ళ నొప్పులతో బాధపడేటువంటి వారు కొన్ని ఆకులు తినడం వల్ల మోకాళ్ల నొప్పుల నుంచి విముక్తి పొందవచ్చు వాటి గురించి చూద్దాం.యూరిక్ యాసిడ్ వల్ల కిడ్నీల పైన తీవ్రమైన ప్రమాదం చూపిస్తుంది.. దీనివల్ల కిడ్నీలు సరిగా ఫిల్టర్ చేయలేకపోతాయట. అంతేకాకుండా పొత్తి కడుపులో నొప్పి, మోకాళ్ల నొప్పులు, జ్వరం, మూత్ర విసర్జనలు ఇబ్బందులు ఇవే యూరిక్ యాసిడ్ యొక్క లక్షణాలు వీటిని తగ్గించుకోవాలి అంటే.. తులసి చెట్టు ఆకులలో చాలా ఔషధ గుణాలు లభిస్తాయి.. తులసి ఆకులను తరచూ నమిలి తింటూ ఉండడం వల్ల రీజనల్ వ్యాధులను కూడా దరిచేరకుండా చేస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ కూడా చెక్ పెట్టవచ్చు. కొత్తిమీర ఇది మనకు ఎక్కడైనా సరే అందుబాటులో లభిస్తుంది. కొత్తిమీరలో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలని తగ్గించుకోవచ్చు. కొత్తిమీరలో ఉండే ఔషధ గుణాలు కూడా యూరిక్ యాసిడ్ని తగ్గించడానికి చాలా ఉపయోగపడతాయి. అలాగే కొత్తిమీర తినడం వల్ల రక్త శుద్ధి అవుతుంది విష పదార్థాలు కూడా బయటికి వెళ్లిపోతాయి. కొత్తిమీర రసం లేదా నమిలి తిన్నా కూడా ఆరోగ్యానికి చాలా మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. వేప ఆకులలో లేదా వేపకాయలలో మెడిసిన్ గుణాలు చాలా పుష్కలంగా ఉన్నాయి. అందుకే పూర్వపు రోజుల్లో వీటిని ఎన్నో రకాలుగా ప్రజలు ఉపయోగించేవారు. ఎవరికైనా యూరిక్ యాసిడ్ లక్షణాలు కనిపిస్తే వేప ఆకుల ద్వారా వాటిని తగ్గించుకోవచ్చు వేప ఆకులను నమిలి తినడం వల్ల రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా శరీరంలో ఉండే విషయాన్నీ కూడా బయటికి పంపించాలా చేస్తుంది.

# వేడి పాలు తాగుతున్నారా?



పాలు అంటే ఇష్టపడని వారు ఎవరు ఉంటారు. చాలా మంది ఉదయం లేవగానే పాలు తాగుతుంటారు. ఇందులో చాలా పోషకాలు ఉంటాయి కూడా. పాలు తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి.ముఖ్యంగా పాలు తాగడం వల్ల ఎముకలకు బలం అంటారు నిపుణులు. ఇందులో ఉండే కాల్షియమే దీనికి ప్రధాన కారణం. అయితే వేసవిలో పాలు తాగితే వేడి అంటారు కొందరు. అందుకే వేసవిలో పాలు తాగడమే మానేస్తుంటారు. ఇంతకీ ఎండాకాలంలో పాలు తాగవచ్చా లేదా? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. పాల వల్ల అసిడిటీ కలుగుతుందట. అందుకే ఖాళీ కడుపున పాలు తాగవద్దు అంటారు నిపుణులు. ఖాళీ కడుపుతో పాలు తాగాలి అనుకుంటే ఖచ్చితంగా దానితో ఏదైనా నట్స్ తినండి. దీని వల్ల మీ కండరాలను బలంగా మారుతాయి. ఇక వేసవిలో, చల్లని పాలు తాగడం అలవాటు చేసుకోండి. ఎందుకంటే వేడి పాలు తాగడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. అందుకే వేసవిలో వేడి పాలకు బదులుగా చల్లని పాలు అలవాటు చేసుకోవాలి. దీని వల్ల శరీరం చల్లగా ఉంటుంది. ఇక చలికాలంలో గోరువెచ్చని పాలు తాగవచ్చు.ఇక చాలా మంది వ్యాయామం, వర్కౌట్లు చేసిన తర్వాత లేదంటే ముందు పాలు తాగుతుంటారు. ఇలా చేయవద్దు అంటున్నారు నిపుణులు. అలా కాకుండా వ్యాయామం పూర్తైన అరగంట తర్వాత మాత్రమే పాలు తాగాలట. దీంతో శరీరానికి పోషకాలు అందుతాయి. జలుబు లేదా ఫ్లూ వంటి సమస్యలు ఉంటే చల్లని పాలు తాగకుండా గోరువెచ్చని, వేడి పాలు తాగాలి. దీంతో మీరు గొంతు నొప్పి నుండి ఉపశమనం పొందుతారు. కొందరికి పడుకునే ముందు పాలు తాగే అలవాటు ఉంటుంది. అయితే చలికాలంలో మాత్రం గోరువెచ్చిన పాలనే తాగాలి. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయం చేస్తుంది. చలి నుండి రక్షిస్తుంది. వేడి పాలు జీర్ణ సమస్యలు, కడుపు నొప్పి, గ్యాస్ నుంచి దూరంగా ఉంచుతాయి. నిద్రలేమి ఉంటే, రాత్రిపూట గోరువెచ్చని పాలు తీసుకోవడం వల్ల నిద్ర వస్తుందట. పాలలో ఉండే అమినో యాసిడ్లు సెరోటోనిన్ , మెలటోనిన్‌లను నియంత్రించి నిద్ర పోయేలా చేస్తాయి పాలు.

# పుదీనాతో మొటిమలకు చెక్..




పుదీనా అనేది వేసవిలో ఎక్కువగా ఉపయోగించే ఓ ఔషధం. ఇది ఆహారంలో సువాసన, రుచిని పెంచడమే కాకుండా ఆరోగ్య పరంగా కూడా ఎన్నో ఉపయోగాలను కలిగిస్తుంది.ఇందులో ఉండే చల్లదనం కారణంగా వేసవిలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అందుకే చాలామంది ప్రజలు ఖచ్చితంగా తమ వేసవి ఆహారంలో పుదీనాను చేర్చుకుంటారు. అయితే ఇది ఆరోగ్యంతో పాటు మన చర్మానికి కూడా మేలు చేస్తుంది. అలాగే జిడ్డుగల చర్మం లేదా తీవ్రమైన మొటిమల సమస్యలు ఉన్నవారికి పుదీనా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పుదీనాలో క్రిమినాశక లక్షణాలు కనిపిస్తాయి. అందుకే దీన్ని సబ్బు, బ్యూటీ క్రీమ్, క్లెన్సర్ వంటి చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. మీ ముఖం పై పదేపదే మొటిమలు వస్తున్నట్లయితే, మీరు పుదీనాను ఉపయోగించడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. పుదీనాలో మెంథాల్ ఉంటుంది. ఇది శీతలీకరణ లక్షణాలను కలిగి ఉంటుంది. ఈ మూలకం మొటిమలతో సంబంధం ఉన్న ఎరుపు, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా చర్మం పై మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాతో పోరాడే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుదీనాలో ఉన్నాయి. దీనితో పాటు, ఫ్రీ రాడికల్స్‌తో పోరాడడంలో కూడా పుదీనా సహాయపడుతుంది.

మొటిమలు, దాని మచ్చలతో ఇబ్బంది పడుతుంటే, పుదీనా, పసుపును ఉపయోగించవచ్చు. 10 నుంచి 15 పుదీనా ఆకులను మిక్స్ చేసి పేస్ట్ లా తయారు చేయండి. దీని తరువాత దానికి చిటికెడు పసుపు వేసి కలపాలి. ఇప్పుడు నీళ్లతో ముఖం కడుక్కుని ప్యాక్ వేసుకోవాలి. సుమారు 15 నిమిషాల తర్వాత మీ ముఖాన్ని కడగాలి.


పుదీనా, ముల్తానీ మిట్టి ఫేస్ ప్యాక్ మొటిమల మొటిమలకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ముఖంలోని మురికిని శుభ్రపరుస్తుంది. ఈ ఫేస్ ప్యాక్ చేయడానికి, పుదీనా ఆకులను తీసుకొని దాని పేస్ట్ సిద్ధం చేయండి. ఈ పేస్ట్‌లో పెరుగు, ముల్తానీ మిట్టి వేసి కలపాలి. దీన్ని ముఖం, మెడ పై మాస్క్ లాగా అప్లై చేయండి. అది ఆరిన తర్వాత ముఖానికి మసాజ్ చేసి కడిగేయాలి.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# ఛత్తీస్‌గఢ్‌లో కీలక విజయం

**21 మంది మావోయిస్టుల లొంగుబాటు**



ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో 21 మంది మావోయిస్టులు తమ ఆయుధాలతో సహా లొంగిపోయారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. లొంగిపోయిన వారిలో 13 మంది సీనియర్ కేడర్‌కు చెందినవారని ఆయన స్పష్టం చేశారు. ఈ విజయం, నక్సలిజం నిర్మూలనకు కేంద్రం చేస్తున్న పోరాటంలో ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. హింసా మార్గాన్ని విడిచిపెట్టి, జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ఆయన అభినందనలు తెలిపారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు లొంగిపోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పాన్ని ఆయన పునరుద్ఘాటించారు. "ఇప్పటికీ ఆయుధాలు పట్టుకుని ఉన్న మిగతా మావోయిస్టులు కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని అమిత్ షా కోరారు. ఈ పెద్ద ఎత్తున జరిగిన లొంగుబాటును, హింసను విడిచి పెట్టి అభివృద్ధి మార్గాన్ని ఎంచుకోవడానికి మావోయిస్టులు సిద్ధమవుతున్నారనడానికి నిదర్శనంగా అధికారులు అభివర్ణించారు.

దీంతో పాటుగా, అమిత్ షా సోమవారం ముంబైలో జరిగిన రెండు ముఖ్యమైన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఒకటి ఇండియా మారిటైమ్ వీక్2025 ప్రారంభోత్సవం కాగా, మరొకటి నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మత్స్యకారులకు లోతైన సముద్రంలో చేపల వేట పడవల పంపిణీ కార్యక్రమం. ఈ కార్యక్రమాలు దేశ 'బ్లూ ఎకానమీ' (నీలి ఆర్థిక వ్యవస్థ) ని బలోపేతం చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉన్నాయి.

# భారత్-చైనా విమాన సేవలు పునఃప్రారంభం

**గ్వాంగ్జౌలో ఇండిగో విమానానికి ఘనస్వాగతం**

ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్, చైనా మధ్య విమాన సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. గాల్వాన్ లోయ వద్ద ఉద్రిక్తతల కారణంగా నిలిచిపోయిన ఈ సేవలను పునరుద్ధరిస్తూ, ఇండిగో ఎయిర్‌లైన్స్ కోల్‌కతాగ్వాంగ్జౌ మధ్య విమానాన్ని నడిపింది. ఈ క్రమంలో, చైనాలోని గ్వాంగ్జౌలో ల్యాండ్ అయిన ఇండిగో విమానంలోని ప్రయాణికులకు చైనా సోమవారం ఘన స్వాగతం పలికింది. ఈ విమాన సేవలు పునఃప్రారంభం కావడాన్ని భారతదేశంలోని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధి యు జింగ్ స్వాగతించారు. "అక్టోబర్ 27న ఉదయం, ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం చైనాలోని గ్వాంగ్జౌకు సురక్షితంగా చేరుకుంది. హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాం," అని ఆయన 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా పోస్టు చేశారు.

కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నిన్న అర్ధరాత్రి తర్వాత ఈ మొదటి విమానం గాంగ్జౌకు బయలుదేరింది. నవంబర్ 11వ తేదీ నుంచి కోల్‌కతాగ్వాంగ్జౌ మార్గంలో విమాన సర్వీసులను ప్రతిరోజూ నడుపుతామని ఇండిగో ప్రకటించింది. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సమావేశమైన సమయంలోనే రెండు దేశాల మధ్య విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించడం జరిగింది. ఆ నిర్ణయానికి అనుగుణంగానే ప్రస్తుతం ఈ విమాన సేవలు పునఃప్రారంభమయ్యాయి.




# రక్షణ రంగంలో స్వావలంబనే కీలకం

**30,000 కోట్ల ఎగుమతి లక్ష్యం**





కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం న్యూఢల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ వార్షిక సదస్సులో ప్రసంగించారు. 'రక్షణ రంగంలో స్వావలంబన: స్వదేశీ పరిశ్రమ ద్వారా జాతీయ భద్రతను బలోపేతం చేయడం' అనే నేపథ్యంతో ఈ కార్యక్రమం జరిగింది.

ప్రైవేట్ రంగానికి పిలుపు: రక్షణ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి స్వావలంబనే ఏకైక మార్గం అని రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దేశీయ రక్షణ పరిశ్రమ, ముఖ్యంగా ప్రైవేట్ రంగాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కేవలం పూర్తి వ్యవస్థల తయారీపై మాత్రమే కాకుండా, వ్యక్తిగత ఉపవ్యవస్థలు మరియు విడి భాగాల ఉత్పత్తిపై దృష్టి సారించాలని కోరారు. అలాగే, నిర్వహణ మరియు సరఫరా గొలుసులలో ఆధిపత్యం సాధించాలని ఆయన సూచించారు. ఎగుమతుల లక్ష్యం: మోదీ ప్రభుత్వం 'మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ది వరల్డ్' (భారత్‌లో తయారీ, ప్రపంచం కోసం తయారీ) లక్ష్యంతో ఒక నిజమైన ఉత్పాదక స్థావరాన్ని ఏర్పాటు చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం దేశం రక్షణ ఎగుమతుల్లో గణనీయమైన పురోగతి సాధిస్తోందని పేర్కొంటూ, మార్చి 2026 నాటికి ఈ ఎగుమతులను ?30,000 కోట్లకు చేర్చడానికి భారత్ సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఈ లక్ష్య సాధనకు గాను, దేశీయ పరిశ్రమ అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ఉత్పత్తులను పెద్దఎత్తున తయారు చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.

# అమెరికా కఠిన చర్యలు

**- 'డంకీ రూట్' ద్వారా అక్రమంగా ప్రవేశించిన 54 మంది భారతీయులు బహిష్కరణ**

అమెరికాలో అక్రమ వలసలపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో, "డంకీ రూట్" ద్వారా దేశంలోకి ప్రవేశించారనే ఆరోపణలపై 54 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. స్వదేశానికి వెనక్కి పంపబడిన వారిలో అధికశాతం హర్యాణా రాష్ట్రానికి చెందిన యువకులే కావడం గమనార్హం.

బహిష్కరణకు గురైన వారిలో 16 మంది కర్నాల్‌కు చెందినవారు, 15 మంది కైతాల్‌కు చెందినవారు ఉన్నారు. అలాగే అంబాలా (5), యమునా నగర్ (4), కురుక్షేత్ర (4), జింద్ (3), సోనిపట్ (2), పంచకుల, పానిపట్, రోహ్తక్, ఫతేహాబాద్ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీరంతా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారేనని, ఢల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నట్లు పోలీసులు ధ్రువీకరించారు.

ఈ 54 మంది అక్రమంగా 'డంకీ రూట్' ద్వారా అమెరికాలోకి ప్రవేశించినట్లు కర్నాల్ డీఎస్పీ సందీప్ కుమార్ తెలిపారు. బహిష్కరణకు గురైన వారందరినీ పోలీసుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ వలసలపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి పెద్ద సంఖ్యలో స్వదేశాలకు పంపిస్తున్నారు. ఈ ఏడాది కూడా వేల సంఖ్యలో అక్రమవలసదారులను దేశం నుంచి బహిష్కరించినట్లు సమాచారం.



# రక్షణ రంగంలో స్వావలంబన, శాంతిభద్రతల్లో చిత్తశుద్ధి

**- దేశాభివృద్ధికి రెండు ప్రధానాంశాలు**



భారతదేశం యొక్క భవిష్యత్తు, జాతీయ భద్రతకు సంబంధించిన రెండు కీలక అంశాలపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టి సారించారు. రక్షణ రంగంలో పూర్తి స్వావలంబన సాధించడం, అలాగే శాంతిభద్రతల నిర్వహణలో అధికారుల వృత్తిపరమైన చిత్తశుద్ధి దేశాభివృద్ధికి అత్యంత కీలకమని ఈ ఇద్దరు ప్రముఖులు ఉద్ఘాటించారు. దేశంలో 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ రెండు స్తంభాలు బలోపేతం కావడం తప్పనిసరి అని వారి ప్రసంగాల సారాంశం తెలియజేస్తుంది.

న్యూఢల్లీలో జరిగిన సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ వార్షిక సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశీయ రక్షణ పరిశ్రమకు కీలక మార్గదర్శకాలను అందించారు. 'రక్షణ రంగంలో స్వావలంబన' అనే నేపథ్యంతో జరిగిన ఈ సదస్సులో ఆయన, సవాళ్లను ఎదుర్కోవడానికి ఆత్మనిర్భరతే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. రక్షణ పరికరాలను కేవలం 'అసెంబుల్' చేయడమే కాకుండా, వాటిలో ఉపయోగించే విడి భాగాలు మరియు ఉపవ్యవస్థల తయారీపై పరిశ్రమలు దృష్టి పెట్టాలని ఆయన కోరారు. తద్వారా, నిర్వహణ మరియు సరఫరా గొలుసులలో విదేశీయులపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించాలని పిలుపునిచ్చారు.


దేశం యొక్క రక్షణ ఎగుమతుల వృద్ధి వేగాన్ని ప్రస్తావిస్తూ, మార్చి 2026 నాటికి రక్షణ ఎగుమతులను 30,000 కోట్లకు చేర్చడానికి భారత్ సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం 'మేడ్ ఇన్ ఇండియా, మేడ్ ఫర్ ది వరల్డ్' అనే స్ఫూర్తితో ఒక నిజమైన ఉత్పాదక స్థావరాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ప్రైవేట్ రంగం మరింత చురుకుగా పాలుపంచుకుంటూ, పెద్దఎత్తున అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేయాలని, తద్వారా భారతదేశాన్ని రక్షణ తయారీ కేంద్రంగా మార్చాలని ఆయన ఆకాంక్షించారు.

మరోవైపు, రాష్ట్రపతి భవన్‌లో ఇండియన్ పోలీస్ సర్వీస్ 77వ బ్యాచ్ (2024 ఆర్ఆర్) ప్రొబేషనర్లను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. శాంతిభద్రతలు మరియు పౌరుల రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించబోయే ఈ యువ అధికారులకు ఆమె విలువైన సలహానిచ్చారు. పోలీస్ అధికారులు చట్టం నుంచి అధికారాలను పొందినప్పటికీ, వారి నిజమైన అధికారం, శక్తి వ్యక్తిగత, వృత్తిపరమైన చిత్తశుద్ధి నుంచే వస్తుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. యువ అధికారుల నేతృత్వంలోని 'భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పోలీస్ వ్యవస్థ' రాబోయే కాలంలో 'వికసిత్ భారత్' నిర్మాణంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఆమె ఉద్ఘాటించారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో కూడిన సేవ ద్వారా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవడం అత్యంత ముఖ్యమని ఆమె వారికి సూచించారు.





# కరూర్ తొక్కిసలాట బాధితులను కలిసిన విజయ్



తమిళనాడు కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీలో నెల రోజుల క్రితం చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చిన విషయం తెలిసిందే. ఆ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా, సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ విషాదం జరిగిన నెల రోజుల తర్వాత, విజయ్ నేడు మహాబలిపురంలో బాధిత కుటుంబాలను ప్రత్యేకంగా కలిశారు. మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌లో బాధిత కుటుంబాలతో విజయ్ సమావేశమయ్యారు. మరణించిన వారికి చెందిన 37 కుటుంబాలతో సహా మొత్తం 200 మందిని ఈ భేటీ కోసం పిలిచారు. ఈ సమావేశం కోసం టీవీకే దాదాపు 50 గదులను బుక్ చేసింది. కరూర్‌తోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న బాధిత కుటుంబాలను ప్రత్యేక బస్సుల్లో రిసార్ట్‌కు తరలించారు. ప్రతీ కుటుంబం నుంచి నాలుగు నుండి ఐదుగురు వ్యక్తులు విజయ్‌ను కలవడానికి వచ్చారు. ఈ సందర్భంగా విజయ్ ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అయితే, ఈ భేటీకి మీడియా సహా ఇతరులను ఎవరినీ అనుమతించలేదు.

2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త పార్టీని స్థాపించిన విజయ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టారు. గత నెల 27న కరూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగింది. కాగా, మృతుల కుటుంబాలకు టీవీకే ఇప్పటికే ఆర్థిక సాయంగా రూ.20 లక్షలు అందజేసిన విషయం తెలిసింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in